



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేమేడిపల్లి సత్యం

మూడు డీఏలు ఇవ్వాలి : టీపీటీఎఫ్

కరీంనగర్ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను ఇవ్వాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి దామోదర్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మంత్రివర్గంలో తీసుకున్న నిర్ణయాలు ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్ర అసంతృప్తికి గురి చేశాయన్నారు. జీవో 317 సమస్యలపై దాటవేత వైఖరి రాష్ట్ర ఉపాధ్యాయులంతా తీవ్రంగా నిరసిస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన 15రోజుల్లో మూడు డీఏలు విడుదల చేస్తామని, పెండింగ్ బిల్లులను విడుదల చేస్తామని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరిస్తామని, జీవో 317 బాధితులందరికి న్యాయం చేస్తామని కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో పేర్కొన్నారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకొని 10 నెలలుగా ప్రభుత్వంపై ఒత్తిడి చేయకుండా ఓపిక పట్టామన్నారు. ఇప్పటివరకు ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని విమర్శించారు. డీఏలపై రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని, ఇతర సమస్యల పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

బీసీ కుల గణనపై బీజేపీ వైఖరి వెల్లడించాలి

గణేశ్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బీసీ కులగణనపై బీజేపీ తమవైఖరిని వెల్లడించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బీజేపీ అధిష్ఠానం స్పందించకపోతే డిసెం బరు 5,6వ తేదీల్లో ఢిల్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కులగణను చేపట్టి బీసీ రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం పెంచాలన్నారు. సామాజిక రిజర్వేషన్లపై విధించిన 50 శాతం పరిమితిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ తీసుకొచ్చిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల బీసీ విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చేశారు.



అంతా 'కల్తీ'మయం

- బ్రాండెడ్ వస్తువులకూ తప్పని నకిలీల బెడద
- గుర్తించలేకపోతున్న వినియోగదారులు
- పట్టించుకోని అధికారులు

కరీంనగర్ క్రైం, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): 'కల్తీకి కాదేది అనర్హం' అన్న చందంగా మార్కెట్‌లో ప్రతి వస్తువును కల్తీచేస్తు న్నారు... అడపాదడపా అధికారులు చేస్తున్న దాడుల్లో వెల్లడవు తున్న వివరాలను చూసి వినియోగదారులు విస్తుపోతున్నారు. ఏది కల్తీయో.. ఏది స్వచ్ఛమైనదో తెలియక... ఏది తింటే ఏమవుతుందో తెలియక ఇబ్బందిపడుతున్నారు. కల్తీపై కొరడా ఝుళిపించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కల్తీ వస్తువులతో పాటు నకిలీ వస్తువులు మార్కెట్‌ను ముంచెత్తు తున్నాయి.

● మంచినీళ్ల నుంచి వంటనూనె వరకు..

మంచినీళ్ల నుంచి వంటనూనె, ఆహారపదార్థాలు, పశువుల ఔషధాలు, వాహనాలకు ఉపయోగించే ఇంజన్ ఆయిల్, డిస్టిల్డ్ వాటర్, . హోటళ్లలో ఆహార పదార్థాలు ఇలా అన్నీ కల్తీ మయమవుతు న్నాయి. తాజాగా కరీంనగర్ కేంద్రంగా ఐఫోన్ నకిలీ విడిభా గాలు, పరికరాలు లభ్యమయ్యాయి. ఇటీవల జిల్లా కేంద్రంలోని ఓ ప్రముఖ హోటల్, స్వీట్ హౌస్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేయగా నాణ్యతలేని ఆహారపదార్థాలను, ఎక్స్‌పైరీ అయిన సరుకులను వినియోగిస్తున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు. 25వేల రూపాయల జరిమానా విధించారు. కార్పొరేట్ షాపింగ్ మాల్‌లో కూడా వినియోగదారుల హక్కుల నిబంధనలను పాటిం చక పోవడంతో లీగల్ మెట్రాలజీ అధికారులు కేసు నమోదు చేశారు. బ్రాండెడ్ వస్త్రాల పేరుతో నాణ్యతలేని వస్త్రాలను అమ్మ డాన్ని గుర్తించారు. తినుబండారాలు, వస్త్రాలు, ఎలక్ట్రానిక్ దుకాణా లు, పెట్రోల్ బంకులు, వెటర్నరీ, ఫర్టిలైజర్ దుకాణాల్లో కల్తీ జరుగుతున్నట్లు ఒక్కొక్కటిగా వెలుగులోకి రావడం వినియోగ దారులు కలవరానికి గురవుతున్నారు. కల్తీ ఆహారపదార్థాలు, నకిలీ వస్తువుల ఉత్పత్తి, విక్రయాలను నియంత్రించాల్సిన తూనికలు, కొతల శాఖ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, ఔషధాల నియంత్రణశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో కల్తీ దందా యథేచ్ఛగా కొనసాగుతు న్నదనే విమర్శలు వస్తున్నాయి. కరీంనగర్ కేంద్రంగా కొనసా గుతున్న ఈ కల్తీ ఆహార పదార్థాలు, నకిలీ వస్తువులు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలకు గుట్టుచప్పుడు కాకుండా సరఫరా అవుతున్నాయి. కల్తీ బేకరీ ఫుడ్స్, పశువుల కొవ్వుతో తయారైన నూనెల వాడకంతో ప్రజలు రకరాల ఆరోగ్య సమస్యలకు గురై ఆసుపత్రులపాలవుతూ ఆరోగ్యం, ఆర్థికంగా నష్టాల పాలవుతు న్నారు. వాహనాల్లో ఉపయోగించే ఇంజన్ ఆయిల్, డిస్టిల్డ్ వాటర్, పెట్రోల్, డీజిల్‌ను కల్తీ చేస్తుండడంతోతొందరగా మర మ్మతులకు గురవుతున్నాయి.

● పశువుల ఔషధాలనూ వదిలిపెట్టని అక్రమార్కులు

పశువులకు ఇచ్చే నట్టల నివారణ మందులను కూడా కల్తీ చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో గడువు ముగిసిన మందులను రీ ప్యాక్ చేస్తున్నారు. ఇలా కరీంనగర్ కేంద్రంగా కల్తీ, నకిలీ తయారీ దందా గతంలో పోలీసుల కార్డెన్ సర్చ్, ప్రత్యేక తనిఖీల్లో కొన్ని బయటపడ్డాయి. ఇంకా చాలా రకాల కల్తీ దందాలు నడుస్తున్నట్లు సమాచారం. కల్తీ, నకిలీ తయారీదారులపై కఠినంగా వ్యవహరించాలని వినియోగదారులు కోరుతున్నారు. తూనికలు కొలతల శాఖ, ఫుడ్‌సేఫ్టీ అధికారులు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అడపాదడపా తనిఖీలు నిర్వహించి కొన్ని కేసులు నమోదు చేశారు. గతంలో పోలీసుల తనిఖీల్లో హౌస్సేనిపురలో నకిలీ ఇంజన్ ఆయిల్, బ్యాటరీల్లో నింపేందుకు ఉపయోగించే డిస్టిల్డ్ వాటర్‌ను కల్తీ చేస్తున్నట్లు వెల్లడి కావటంతో తయారీ కేంద్రాన్ని సీజ్ చేశారు. కరీంనగర్‌లోని వాల్మీకినగర్‌లో ఒక ఇంటిలో గుట్టుచప్పుడు కాకుండా పశువుల కొవ్వుతో నూనెను తయారు చేసి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు విక్రయిస్తున్న వారిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నేత బజారు ప్రాంతంలో ఒక గోదాంలో విడి నూనెను ప్యాకెట్లలో నింపుతున్న వ్యక్తిపై పోలీసులు కేసు పెట్టారు. బుట్టిరాజారం కాలనీలో ఎలాంటి లైసెన్స్ లేకుండా నాణ్యత లేకుండా నిషేధిత క్లోరో హైడ్రేట్ పదార్థంతో రంగు ఐస్ తయారు చేస్తున్నట్లు పోలీసుల తనిఖీల్లో వెల్లడైంది. ఎలాంటి అనుమతి లేకుండా ప్రమాదకరంగా గ్యాస్ సిలిండర్ల రీఫిల్లింగ్ చేస్తున్న కేంద్రాలను పోలీసులు గుర్తించారు.

మిగతా 6వ పేజీలో...



చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

గంగాధర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చివరి గింజవరకు ధాన్యం కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఆదివారం గంగాధర మండలం ఉప్పరమల్యాల, రంగరావుపల్లిలో కురిక్యాల పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనగోలు కేంద్రాలను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతుకు మద్దతు ధర లభిస్తుందన్నారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని సూచించారు. కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. ఏదైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో కురిక్యాల సింగిల్ విండో అధ్యక్షుడు తిరుమల్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజితశ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పురమల్ల మనోహర్, ముద్దం జముననగేష్, కంకణాల రాజ్‌గోపాల్‌రెడ్డి, బాపురెడ్డి, కిషన్, రామిడి రాజిరెడ్డి పాల్గొన్నారు.

'ఇంటర్ పరీక్ష ఫీజు పెంచొద్దు'

భగత్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ పరీక్ష ఫీజులను పెంచాలనే ఆలోచనను విరమించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ కోరారు. ప్రస్తుతం 500 రూపాయలు ఉన్న ఫీజును 1500 రూపాయలకు పెంచాలనే ఆలోచనతో ఇంటర్ బోర్డు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడంపై పునరాలోచన చేయాలన్నారు. రాష్ట్రంలో ఇంటర్ చదువు తున్న తొమ్మిది లక్షల మంది విద్యార్థులకు ఇది భారంగా మారుతుందన్నారు. ప్రభుత్వం ఫీజులు పెంచకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఊర చెరువు ఆక్రమణ

కరీంనగర్ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు భూముల ధరలు ఆకాశన్నంటడంతో కొందరు అక్రమార్కులు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటున్నారు. నగర శివారు ప్రాంతాల్లోని చెరువు భూములు అన్యక్రాంతం అవుతున్నాయి. వాటిని కాపాడాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కరీంనగర్ మండలం తీగలగుట్టపల్లి

- ప్రైవేట్ సర్వే నంబర్ పేరుతో శిఖం భూమి అక్రమణ
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

గ్రామం ప్రస్తుతం నగరంలో విలీనమయ్యింది. దీంతో అక్కడి భూముల ధరలు పెరిగాయి. గ్రామంలో ప్రధాన రహదారి సమీపంలోని ఊర చెరువు 215 సర్వే నంబర్‌లో ఎనిమిది ఎకరాలకు పైగా ఉండేది. ఈ చెరువు ద్వారా కింద ఆయకట్టుకు నీరందేది. చెరువు స్థలంలో భారీగా ఆక్రమణలకు గురైంది. చుట్టూ ఇళ్ల వెలిశాయి. దీంతో ఈ చెరువులో నుంచి నీరు బయటకు వెళ్లే కాలువలు నామరూపాల్లేకుండా పోయాయి. వ్యవసాయ భూముల సర్వే నంబర్లు చూపుతూ కొందరు చెరువు శిఖాన్ని కబ్జా చేశారు. ఈ చెరువులోనే ప్రస్తుతం ఓపన్ జిమ్‌తో పాటు, బతుకమ్మ విగ్రహం ఏర్పాటు చేసి బతుకమ్మ ఆటస్థలానికి వినియోగిస్తున్నారు. మరి కొందరు పక్కనే మట్టి పోసి అక్రమించేందుకు యత్నించగా గ్రామస్థులు నీటి పారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు గత నెల 18వ తేదిన చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. అక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. పది రోజుల్లో మట్టి పోసి వారు తీయకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తర్వాత అటువైపు కన్నెత్తి చూడలేదు. ఎనిమిది ఎకరాలకు పైగా ఉన్న ఈ చెరువు ప్రస్తుతం నాలుగు ఎకరాలకు కుదించుకుపోయింది. ఈస్థలం కూడా కబ్జాకు గురి కాకముందే హద్దులు నిర్ణయించాలని, ప్రభుత్వం చెరువును కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గత నెలలో మట్టి పోసిన ప్రాంతంలో పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు



తీగలగుట్టపల్లిలోని ఊర చెరువు

'ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆశలు వమ్ము చేసిన ప్రభుత్వం'

కరీంనగర్ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆశలను రాష్ట్ర ప్రభుత్వం వమ్ము చేసిందని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వతరెడ్డి అన్నారు. ఆదివారం కరీంగర్‌లో నిర్వహించిన ఎస్టీయూ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కులను పరిరక్షించి మరో రెండు డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. మెరుగైన పీఆర్సీని ప్రకటించాలని, జీవో 317 బాధితులకు పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కుబేర్ వ్యవస్థను రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ఆత్మాభిమానం దెబ్బతింటే ఉద్యమ కార్యాచరణకు ఎస్టీయూ వెనుకాడదని స్పష్టం చేశారు. సమావేశంలో పీఆర్ శ్రీనివాస్, రవీంద్రాచారి, హరికిరణ్, సతీష్, సదానందం, కరుణాకర్‌రెడ్డి, సంతోష్, రవి, తిరుపతిరావు, రవీందర్, దయానంద్, వెంకటస్వామి, లక్ష్మణ్‌రావు, రాజు, శ్రీనివాస్, శ్యాంకుమార్, నాగభూషణం, రాజేందర్‌రెడ్డి, ఖలీల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి'

సుభాష్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా చైర్మెన్ కుమారస్వామి, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ ఎల్లారెడ్డి కోరారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని పెంచేలా నిజమైన ఉద్యమకారులను 250 గజాల భూమి ఇస్తామని తమ ఎన్నికల మెనిఫెస్టోలో పేర్కొన్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన హామీలను మరిచిపోయిందన్నారు. ఉద్యమకారులకు 250 గజాల భూమి, నెలకు 25వేల ఫించన్ ఇవ్వాలని కోరారు. ఉద్యమకారుల ఎంపిక కోసం కమిటీని వేయాలని, కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో పది శాతం తగ్గకుండా సంక్షేమ ఫలాలు అందేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళ విభాగం ఉత్తర తెలంగాణ కోఆర్డి నేటర్ ఐల ప్రసన్న, చొప్పరి సుధాకర్, కారుపాక భార్గవి, మాధవి, సాగర్, సుధాకర్ పాల్గొన్నారు.

కనీసం మూడు డీఏలు ఇవ్వాలి: డీటీఎఫ్

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన ఐదు డీఏల్లో కనీసం మూడు డీఏలను, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డీటీఎఫ్ డిమాండ్ చేసింది. రాష్ట్ర మంత్రివర్గం ఒకే డీఏను ప్రకటించి, మార్చిలో మరో డీఏ ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లను తీవ్ర నిరాశకు గురిచేసిందని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆవాల నరహరి, తూముల తిరుపతి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.

పేదలకు పెద్దదిక్కు రేకుర్తి నేత్ర వైద్యశాల

- డాక్టర్ భాస్కర్ మాడేకర్ ఆలోచనతో అంకురార్పన
- పీవీ చేతుల మీదుగా ప్రారంభం
- మూడు దశాబ్దాలకు పైగా సేవలు
- 1,80,000 మందికి కంటి ఆపరేషన్లు

◆ భగత్‌నగర్, ఆంధ్రజ్యోతి

4



దిగువ మానేరులో అరుదైన పక్షులు

- కరీంనగర్‌కు వలస వచ్చిన ఇండియన్ స్కిమ్మర్స్
- ఈ ప్రాంత జీవ వైవిధ్యానికి కొత్త అందం..

5

◆ కరీంనగర్ అర్బన్, ఆంధ్రజ్యోతి



ప్రమిదలు తయారయ్యేదిలా..

దీపావళి అంటేనే ప్రమిదలు గుర్తొస్తాయి.. కొత్త కొత్త రకాల ప్రమిదలు మార్కెట్లోకి వస్తున్నా మట్టి ప్రమిదలకున్న డిమాండ్ తగ్గడం లేదు. కరీంనగర్ సమీపంలోని ఆరెపల్లిలో కొన్ని కుటుంబాలు మట్టి ప్రమిదలు తయారు చేస్తుంటాయి. దీపావళి సందర్భంగా ప్రమిదల తయారీని 'ఆంధ్రజ్యోతి' మీ ముందుకు తెచ్చింది.

◆ ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్





ప్రమిదలు తయారు చేస్తున్న యువకుడు, ప్రమిదలను ఎండబెడుతున్న మహిళ

యూపీఎల్ అధికారులపై చీటింగ్ కేసు నమోదు

జ్యోతినగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ సంస్థలో కాంట్రాక్టు వ్యవహారాలు చేసిన యూటిలిటీ పవర్ టెక్(యూపీఎల్) సంస్థ అధికారులపై ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ఎన్టీపీసీ ప్రాజెక్టులో కాంట్రాక్టరుగా పని చేస్తున్న చందా రాధా కిషన్‌రావుకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. సుమారు 48 లక్షల రూపాయల బిల్లులు ఇవ్వకుండా తనను వేధిస్తున్నారని రాధా కిషన్‌రావు ఫిరాదులో పేర్కొన్నారు. .ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ యూపీఎల్ అధికారులు నిర్లక్ష్యం వహించడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కాంట్రాక్టరు తెలిపారు. రాధాకిషన్‌రావు ఫిర్యాదు మేరకు యుపీఎల్ సీఈవో (నోయిడా) తేంద్ర సింగ్, ఆర్ఎం (రామగుండం ఎన్టీపీసీ) కైలాస్ ప్రసాద్, అధికారులు స్వాతి శుక్లా, సీమా ప్రసాద్‌లపై ఎన్టీపీసీ పీఎస్‌లో కేసు నమోదైంది. కాగా యూపీఎల్ సంస్థ కార్యకలాపాలు ఎన్టీపీసీలో చాలా రోజుల క్రితమే నిలిపివేశారు.

పురుగుల మందు తాగి వృద్ధురాలి ఆత్మహత్య

గన్నేరువరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒంటరితనంతో మనస్తాపం చెందిన ఓ వృ ద్ధురాలు ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు, పోలీసు లు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చొక్కారావుపల్లికి చెందిన ముస్కు లచ్చవ్వ(80) అనే వృద్ధురాలికి నలుగురు కుమార్తెలు ఉన్నారు. అందరికి పెళ్లిళ్ల చేసింది. లచ్చవ్వ భర్త గతంలోనే మృతి చెందాడు. కూతుళ్ల వివాహం అనంతరం ఇంట్లో ఒక్కతే ఉంటున్నది. వృద్ధాప్యంలో ఉన్న తనను కూతుళ్లు చూసుకుంటారో లేదోనన్న బెంగతో ఆదివారం పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. లచ్చవ్వ కుమార్తె నాగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపారు.

అక్రమంగా నిల్వ చేసిన బాణాసంచా పట్టివేత

హుజూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఓ ఇంట్లో నిల్వ చేసిన బాణాసంచాను ఆదివారం పట్టుకున్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి తన ఇంట్లో ఎలాంటి అనుమతి లేకుండా బాణాసంచా నిల్వ చేశారని సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. రూ. 4.37 లక్షల విలువ గల క్రాకర్స్‌ను సీజ్ చేశారు. సీఐ తిరుమల్ గౌడ్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా టపాసులు నిల్వ చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేకాట స్థావరంపై దాడి

రామడుగు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నర్సింగారావు చెరువు సమీపంలో పేకాట ఆడుతున్న సమాచారం మేరకు ఆదివారం పోలీసులు దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 7,070 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి శేఖర్ తెలిపారు.

ఆదర్శం

పేదల ఆసుపత్రిగా పేరుగాంచింది రేకుర్తి నేత్ర వైద్యశాల. అత్యాధునిక సదుపాయాలతో సేవాభావం కలిగిన వ్యక్తుల పర్యవేక్షణలో ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు. దృష్టి లోపం ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి శస్త్ర చికిత్సలు అవసరం ఉన్న వారిని గుర్తించి ఉచితంగా సొంత వాహనాల్లో ఆసుపత్రికి తరలిస్తారు. ఇప్పటి వరకు 1.8లక్షల మందికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించారు.



రేకుర్తిలోని డాక్టర్ భాస్కర్ మాడేకర్ నేత్ర వైద్యశాల


కంటి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్న వైద్యులు

పేదలకు పెద్దదిక్కు

రేకుర్తి నేత్ర వైద్యశాల

- డాక్టర్ భాస్కర్ మాడేకర్ ఆలోచనతో అంకురార్పణ
- పివి చేతుల మీదుగా ప్రారంభం
- మూడు దశాబ్దాలకు పైగా సేవలు
- 1,80,000 మందికి కంటి ఆపరేషన్లు

భగత్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సర్వేంద్రి యానాం.. నయనం ప్రధానం అన్నారు పెద్దలు. నేత్ర సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారిని ఆదుకుంటోంది రేకుర్తిలోని లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్ మాడేకర్ ఉదార నేత్ర వైద్యశాల. ఈ ఆసుపత్రిని 1988వ సంవత్సరంలో అనాటి కేంద్ర మంత్రి పీవీ నర్సింహారావు ప్రారంభించారు. మూడెకరాల స్థలంలో ఆహ్లాదకర వాతావరణంలో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. దేశంలోని నలుమూలల నుంచి వైద్యం కోసం ఇక్కడికి వస్తుంటారు. 37 సంవత్సరాలుగా 7.95 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 1.8 లక్షల మందికి ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించారు. అందులో లక్ష కంటి శస్త్ర చికిత్సలు ఉచితంగా చేశారు. జిల్లాలోని 65 ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం ఉన్న పిల్లలకు ఉచితంగా కంటి అద్దాలు అందించారు. నగరానికి చెందిన ఇంజనీర్ కోల అన్నారెడ్డి సహకారంతో 4,190 చనిపోయిన వారి నుంచి కళ్లు సేకరించి ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి పంపించారు. వారానికి నాలుగు గ్రామాల్లో నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా కంటి ఆపరేషనన్లు, కంటి అద్దాలు, ఉచిత భోజన వసతి కల్పిస్తారు.

అందుబాటులో ఆధునిక పరికరాలు

రేకుర్తి నేత్ర వైద్యశాలలో కార్పొరేట్ స్థాయిలో శస్త్రచికిత్సలు, పరీక్షల కోసం అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఆరు ఆపరేటింగ్ మైక్రోస్కోప్‌లు, ఐదు ఆటో రిఫ్రాక్టర్ మీటర్స్, ఐవోఎల్ మాస్టర్, ఏడీ యాగ్లేజర్, విజువల్స్ గ్రీన్లజర్, మూడు ఫాకో మిషన్లు, (సెంచురియన్, లారియేట్, లైజియాన్), ఆటో లెన్స్‌మీటర్, నాన్ కాంటాక్ట్ టొనమీటర్, హమ్‌ఫ్రేస్ ఫీల్డ్ అనలైజర్, ఎ స్కాన్ బయోమీటర్ ఆక్ట్-2, ఆటో క్లేవ్ ఉన్నాయి. ఆసుపత్రికి మూడు బస్సులు, ఒక మినీ వ్యాన్‌లు ఉన్నాయి. ఈ వాహనాల ద్వారా రోగులను ఆసుపత్రికి తీసుకొస్తుంటారు.


ఆసుపత్రిలోని అధునాతన పరీక్షా యంత్రం

ప్రత్యేక శస్త్ర చికిత్సలు

కార్పొరేట్ ఆసుపత్రుల్లో చేసే శస్త్ర చికిత్సలు రేకుర్తి ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయి. అత్యాధునిక పరికాలతో కూడిన ఆపరేషన్ థియేటర్ ఇక్కడి ఉంది. ఆసుపత్రి అభివృద్ధి కోసం ఛైర్మన్ కొండావేణుమూర్తి, వైస్ ఛైర్మన్ చిదుర సురేష్, వైస్ ఛైర్మన్ ప్రకాశ్ హోల్లా, సెక్రటరీ బొమ్మ పవన్‌కుమార్, డాక్టర్ మురళీధర్‌రావు, కోల అన్నారెడ్డి కృషి చేస్తున్నారు.

నిష్ణాతులైన వైద్యులు

50 రూపాయల నామ మాత్రపు కన్సల్టేషన్ ఫీజుతో, అతి తక్కువ ఖర్చుతో కంటి శస్త్ర చికిత్సలు ఇక్కడ నిర్వహిస్తారు. నిష్ణాతులైన పది మంది వైద్యులు అందుబాటులో ఉంటారు.

మరిన్ని సేవలు అందిస్తాం..

- కొండా వేణుమూర్తి, ఆసుపత్రి ఛైర్మన్



రేకుర్తిలోని భాస్కర్ మాడేకర్ ఉదార నేత్ర వైద్యశాలలో భవిష్యత్తులో మరిన్ని సేవలను విస్తరించేందుకు కృషిచేస్తున్నాము. భవిష్యత్తులో లేజర్ (లాసిక్) పరికరాన్ని ఏర్పాటు చేస్తాం. పేదలకు సేవ చేయాలనేదే ఆసుపత్రి లక్ష్యం.


కంటి శస్త్ర చికిత్స కోసం వేచి ఉన్న రోగులు

ఆసుపత్రిలో 70 మంది సిబ్బంది ప్రజలకు సేవలు అందిస్తున్నారు.

ఆటో బోల్తా.. నలుగురికి తీవ్రగాయాలు


ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

మానకొండూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామ శివారులో ఆటో అదుపు తప్పి బోల్తా పడ్డ సంఘటనలో నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. శంకరపట్నం మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన గడ్డి కుమారస్వామి ఆదివారంతన ఆటోలో ప్రయాణికులను కేశవపట్నానికి తరలిస్తున్నాడు. మండలంలోని గట్టుదుద్దెనపల్లి కాకతీయ కాల్వ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కుమారస్వామి, చింతకుంట గ్రామానికి చెందిన ఎండీ ఖాజతో పాటు మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం మేరకు 108 సిబ్బంది ఈఎంటీ సతీష్‌రెడ్డి, పైలెట్ ఖాజ ఖలీల్ ఉల్లా గాయపడ్డ నలుగురిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్య

ఇబ్రహీపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండలింగాపూర్ గ్రామానికి చెందిన గడ్డల జ్యోతి (55) అనే మహిళ గ్రామ శివారులోని పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.... జ్యోతి పదేళ్ల నుంచి షుగర్, బీపీతో పాటు మోకాళ్ల నొప్పులతో బాధపడుతోంది. పలు ఆసుపత్రులు తిరిగినా నయం కాకపోవడంతో మనస్తాపం చెంది ఈ నెల 26వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆదివారం ఉదయం పెద్ద చెరువులో జ్యోతి పడి ఉన్న విషయాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ అనిల్ పరిశీలించి గ్రామస్థుల సహకారంతో బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు జ్యోతి కుమారుడు గడ్డల విక్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఇల్లందకుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకుర్తి గ్రామానికి చెందిన సనబోయిన కవిత (43) అనే మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై రాజ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కవిత ఈ నెల 21న పత్తి తీసే పని కోసం ట్రాక్టర్‌లో వెళ్లింది. ట్రాక్టర్‌ను డ్రైవర్ కుమారస్వామి అజాగ్రత్తగా నడుపడం వల్ల దానిపై కూర్చున్న కవిత ప్రమాదవశాత్తు కిందపడింది. ఆమెకు తల, మెడ భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు జమ్మికుంటలోని ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందింది. కవితకు భర్త సమ్మయ్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త సమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ కుమారస్వామిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజకుమార్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేశామన్నారు.

విద్యుదాఘాతంతో బోర్‌వెల్ మెకానిక్ మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, ఇన్‌సెట్‌లో వైద్య వెంకటేశ్వర్లు(ఫైల్)

కోల్‌సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జీఎం కాలనీలో బోర్‌వెల్ మోటార్ మరమ్మతు చేస్తున్న బోర్‌వెల్ మెకానిక్, ఎలక్ట్రిషియన్ వైద్య వెంకటేశ్వర్లు(57) ఆదివారం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. జీఎం కాలనీకి చెందిన చిన్నవెల్లి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి తన బోర్‌వెల్ మోటార్ పనిచేయడం లేదని బోర్‌వెల్ మెకానిక్ ఎలక్ట్రిషియన్ వెంకటేశ్వర్లును పిలిపించారు. యజమానిని విద్యుత్ సరఫరా నిలిపివేయమని వెంకటేశ్వర్లు చెప్పి స్టార్టర్ ముట్టుకోగా షాక్‌కు గురై మృతిచెందాడు. వెంకటేశ్వర్లు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. స్థానిక విఠల్‌నగర్‌లో నివాసముండే వెంకటేశ్వర్లు కుటుంబాన్ని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పరామర్శించారు. విద్యుత్‌శాఖ పరంగా రూ.5లక్షల పరిహారం ఇచ్చేలా చర్యలు చేపట్టాలని ఏడీఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. వెంకటేశ్వర్లు మృతిచెందడంపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు. కుమారుడు వైద్య నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఉపా చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాటం


సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

సుభాష్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపా చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభను పౌరసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా సాయిబాబా కూతురు మంజీర మాట్లాడుతూ సాయిబాబాను ప్రభుత్వమే హత్య చేసిందని ఆరోపించారు. 90శాతం అంగవైకల్యం, పోలియో ఇతర 19 రకాల వ్యాధులతో బాధపడుతున్న ఆయనకు మందులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. సాయిబాబాను అరెస్టు చేసిన సమయంలో ఆయన వీల్ ఛైర్‌ను కావాలనే ధ్వంసం చేశారని అన్నారు. సమయానికి అత్యవసర మందులు, పుస్తకాలు, ఇతర సామగ్రిని కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. దళితులు, పీడిత ప్రజల పక్షాన, ఆదివాసీలపై ప్రభుత్వాల దమనకాం డకు వ్యతిరేకంగా మాట్లాడినందుకు ప్రభుత్వం ఆయనపై కక్ష కట్టిందని ఆరోపించారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఆదివాసీలను హననం చేసే ఆపరేషన్ గ్రీన్ హంట్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఎన్నో సభలు నిర్వహించడంతోనే ప్రభుత్వం ఆయనపై అక్రమంగా ఉపా కేసు మోపి జైల్లో నిర్బంధించిందన్నారు. జైల్లో ఎందరో ఆదివాసీ యువకులను చేయని నేరానికి అక్రమంగా నిర్బంధించారని, వారి కోసం ఒక విద్యాసంస్థను నెలకొల్పే ఆలోచన సాయిబాబకు ఉండేదని ఆమె అన్నారు.

కార్యక్రమంలో విరసం నాయకుడు బాలసాని రాజయ్య, పౌర హక్కుల సంఘం బాధ్యులు శ్రీపతి రాజగోపాల్, నారా వినోద్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాధన కుమారస్వామి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కె విశ్వనాథ్, రిటైర్డ్ ఎంఈవో వీరగోని పెంటయ్య, పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీపతి రాజగోపాల్, డీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మార్వాడి సుదర్శన్, రైతు సంఘం నాయకుడు ముడిమాడుగుల మల్లన్న, సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, మానవహక్కుల వేదిక బాధ్యులు కె ఆజయ్, రచయితలు అవునూరి సమ్మన్న, దేవేందర్, విద్యార్థి సంఘం నాయకులు చుక్క గంగారెడ్డి, దొగ్గలి రాజు, రచయిత కందుకూరి అంజయ్య, దళిత హక్కుల పోరాటాల సమితి తాళ్లపల్లి లక్ష్మణ్, ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లగౌడ్, సీపీఐ, సీపీఎం, డీటీఎఫ్, ఎంసీపీఐ, మానవ హక్కుల వేదిక, ఇతర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సాయిబాబా కూతురు మంజీర

బెటాలియన్‌లో పోలీసుల నిరసన

- సస్పెన్షన్ ఎత్తివేయాలని
కమాండెంట్ ఆఫీస్ ఎదుట ధర్నా


సిరిసిల్ల బెటాలియన్‌లో ధర్నా చేస్తున్న పోలీసులు

సిరిసిల్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 17వ బెటాలియన్‌లో పోలీసులు, హెడ్‌కానిస్టేబుళ్ల నిరసనలు కొనసాగాయి. ఏక్‌పోలీస్ అమలు చేయాలంటూ చేసిన ఆదోళనలో సస్పెన్షన్‌కు గురైన 39 మందిలో జిల్లా బెటాలియన్‌కు సంబంధించి బి తిరుపతి, బి శేఖర్ కె స్వామి, ఎ లక్ష్మణ్, శివరామకృష్ణ, కె నవీన్ ఉన్నారు. ఆదివారం వారితోపాటు బెటాలియన్ సముదాయంలో మిగతా పోలీసులు కమాండెంట్ ఆఫీస్ ఎదుట సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ధర్నా చేశారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఏక్ పోలీస్ అమలు చేయాలని శాంతియుత నిరసన చేస్తే కొంత మందిని సస్పెండ్ చేశారన్నారు. సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని, లేనిపక్షంలో నిరసనలో పాల్గొన్న తమను కూడా సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు.

పాత వాటికి కొత్త రూపం..

ఏదో సాధించాలనే ఆలోచన ఈ యువకుడిది.. నూతన ఆవిష్కరణలతో మూడుసార్లు వరల్డ్ రికార్డు సాధించాడు. రోబో, రిమోట్‌తో జాతీయ జెండాను ఎగురవేయడంతో పాటు ఎలక్ట్రిక్ బైక్ రూపొందించింది పలువురి ప్రశంసలందుకున్నాడు. పాత వస్తువులకు కొత్త రూపమిస్తూ అందరిని ఆకట్టుకుంటున్నాడు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికికి చెందిన బోసెట్టి భగత్ ప్రశాంత్...

- వినూత్న రీతిలో వస్తువుల తయారీ
- ఖని యువకుడి అద్భుత ఆవిష్కరణలు


పెట్రోల్ స్కూటీని ఎలక్ట్రికల్‌గా మార్చిన భగత్


వీల్‌రోలర్‌తో భగత్

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి): నిత్యం ఏదైనా కొత్తగా సాధించాలనే తపన ఆ యువకుడిది. చదివిన చదువుతో తనకున్న జ్ఞానాన్ని జోడించి సరికొత్త ఆవిష్కరణలకు ప్రాణం పోస్తున్నాడు గోదావరిఖనికి చెందిన భగత్ ప్రశాంత్. స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన భగత్ డిప్లమా ఎలక్ట్రానిక్స్ డిగ్రీ బీకాం చదివాడు. పనికిరాని వస్తువులతో రోబోను, రిమోట్‌తో జాతీయ జెండాను ఎగురవేయడం, వీల్ రోలర్స్, పెట్రోల్‌తో నడిచే స్కూటీని ఎలక్ట్రిక్ స్కూటీగా తయారుచేయడంతో పాటు బైక్ పిస్టన్ ఎయిర్ డివైస్‌ను తయారు చేసి మూడు సార్లు వరల్డ్ రికార్డు సాధించాడు. పనికి రాని వస్తువులతో సరికొత్త వస్తువులను తయారుచేస్తున్నాడు. పెట్రోల్‌తో నడిచే స్కూటీని ఎలక్ట్రిక్ స్కూటీగా మార్చాడు. ఇది గంటకు 22 కిలోమీటర్ల స్పీడ్‌తో వెళుతుంది. భగత్ చెబుతున్నాడు. ఇలాంటి రెండు ఎలక్ట్రిక్ స్కూటీల్లో ఒకటి తన తండ్రికి బహుమతిగా ఇచ్చి, మరొకటి తాను వాడుకుంటున్నాడు. ఇందుకు గాను అప్పటి జిల్లా కలెక్టర్ సంగీతసత్యనారాయణ నుంచి ప్రశంసలు అందుకున్నాడు. అలాగే కొబ్బరి తురుమును తయారు చేసుకోవడానికి ఇళ్లలో మహిళలు ఇబ్బంది పడుతున్నారని గ్రహించిన భగత్ మార్కెట్‌లో ఎక్కువ ధర లభించే వాటికన్నా తక్కువ ధరలో మిషన్‌ను తయారు చేశాడు. ఇలా వినూత్న రీతిలో సరికొత్త ఆవిష్కరణలు చేస్తూ అందరితో భళా భగత్ అనిపించుకుంటున్నాడు.

ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని ఆవిష్కరణలు

- భగత్‌ప్రశాంత్

చిన్నప్పటికి వస్తువులను తయారు చేయాలనే తపన ఉండేది. అందుకే డిప్లమా ఎలక్ట్రానిక్స్ చదివాను. అప్పటి నుంచి పనికి రాని వస్తువుతో ఏదో ఒకటి తయారు చేస్తూ వస్తున్నాను. తయారు చేసిన రెండు ఎలక్ట్రిక్ స్కూటీల్లో ఒకటి నేను, మరొకటి నాన్న నడుపుతున్నాం. వీల్‌రోలర్స్ బైక్ పిస్టమ్ ఎయిర్ మిషన్ తయారు చేశాను. అందుకు మూడుసార్లు వరల్డ్ రికార్డులు అందుకున్నాను. చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని ఆవిష్కరణలను రూపొందిస్తాను. నాన్న భగత్ ప్రశాంత్ సైకిల్ రిపేర్ షాపు నడుపుతున్నాడు. కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో నేను ఆర్ఎఫ్‌సీఎల్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాను.

నేపాల్‌లో కరీంనగర్ వాసి మృతి

-ఆధ్యాత్మిక యాత్రలో విషాదం



కరీంనగర్ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నేపాల్ యాత్రకు వెళ్లిన కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన పర్వతనేని నర్సింగారావు(60) అనారోగ్యానికి గురై ఆదివారం మృతి చెందాడు. మృతుడి బంధువులు, స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లా మరిమడ్ల గ్రామానికి చెందిన నర్సింగారావు చాలా కాలం కిందట కరీంనగర్‌కు వచ్చి ఇక్కడే ప్రగతినగర్‌లో స్థిరపడ్డాడు. అరుణాచలంలోని రుద్రాక్షస్వామి ట్రస్టు ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 250 మంది ఈనెల 18న నేపాల్ యాత్రకు వెళ్ళగా, అందులో కరీంనగర్‌కు చెందిన నర్సింగారావు ఉన్నారు. నేపాల్‌లోని పశుపతినాథ్, ముక్తినాథ్, జనక్‌పూర్ ప్రాంతాల సందర్శనలో భాగంగా మూడు రోజుల కిందట ముక్తినాథ్‌యాత్రలో నర్సింగారావు స్నానం చేసే సమయంలో ఒక్కసారిగా అనారోగ్యానికి గురయ్యాడు. వెంటనే తోటి యాత్రికులు అతన్ని జనక్‌పూర్‌లోని ఒక ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. నర్సింగారావు అనారోగ్యంకు గురైన విషయాన్ని కరీంనగర్‌లోని ఆయన కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. అతని ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకువచ్చేందుకు ఎయిర్ అంబులెన్స్‌ను కూడా సిద్ధం చేస్తుండగా ఆదివారం ఉదయం మృతి చెందాడు. నర్సింగారావుకు భార్య, కూతురు, కొడుకులున్నారు. నర్సింగారావు కరీంనగర్‌లో ఒక ప్రైవేట్ చిట్‌ఫండ్స్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. నర్సింగారావు మృతదేహాన్ని కరీంనగర్‌కు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. నర్సింగారావు మృతి పట్ల ప్రగతినగర్ అభివృద్ధి, సంక్షేమ సంఘం ప్రతినిధులు, తోటపల్లి తాజా మాజీ సర్పంచ్ బోయినిపల్లి నర్సింగారావు, మానేరు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సంతాపం తెలిపారు.

గోదావరిలో మునిగి యువకుడి మృతి


వెంకటేష్(ఫైల్)

మల్లాపూర్, అక్టోబరు, 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిపేట గ్రామంలోని గోదావరి నదికి తన్నీర్ వెంకటేష్ (27) అను తాపీ మెస్త్రి స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు ఆదివారం నీట మునిగి మృతి చెందాడు.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో తాపీ మేస్త్రీగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తు న్న తన్నీర్ వెంకటేష్ ఆదివారం పనులకు సెలవు కావడంతో తోటి కూలీలతో కలిసి గోదావరి నదికి స్నానానికి వెళ్లాడు. స్నానం చేస్తున్న క్రమంలో ఈత రాకపోవడంతో వెంకటేష్ నీటిలో మునిగిపోయాడు. గమనించిన తోటి కూలీలు, స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో మునిగి వృద్ధుడు..

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని చెరువులో ప్రమాదవశాత్తు నీట మునిగి పోచెట్టి మాలద్రి(65) అనే భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా జలదంకి చెందిన పోచెట్టి మాలద్రి జగ్గసాగర్ గ్రామంలోని ఓ మేస్త్రి వద్ద ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం గ్రామంలోని చెరువులో ఒడ్డున ఉండి స్నానం చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి నీటిలో మునిగాడు. అక్కడే ఉన్న స్థానికులు గమనించి ఒడ్డుకు చేర్చినా అప్పటికే మృతి చెందాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానిన పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లైఫ్ స్టైల్

సెకండ్ హ్యాండైనా.. కొనేద్దాం..


కోరుట్లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న సెకండ్ సేల్స్ కారు

పాతదో, కొత్తదో ఇంటికో కారు ప్రస్తుత రోజుల్లో సాధారణమైపోయింది. ఎవరి ఆర్థిక పరిస్థితిని బట్టి వారికి అందుబాటులో ఉన్న కారును కొనుక్కుని అవసరాలకు వినియోగించుకుంటున్నారు. కుటుంబంలో నలుగురు సభ్యులు ఉన్నారంటే చాలు కారు అవసరం ఉంటోంది. అందరూ కలిసి పండగలకు ఊరు వెళ్లాలన్నా, ఏ విహార యాత్రలకు వెళ్లాలన్నా స్వంత కారైనా లేదా అద్దె కారైనా తీసుకుని వెళ్తున్నారు. వినియోగదారుల ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా మార్కెట్లో సెకండ్ హ్యాండ్ కార్లు లభిస్తున్నాయి. అందుబాటు ధరల్లో ఉండడంతో పాటు ఫైనాన్స్ సౌకర్యం కూడా కల్పిస్తుండడంతో కొనేందుకు ముందుకు వస్తున్నారు. అయితే ఎప్పటికప్పుడు లేటెస్ట్ వర్షన్‌లతో కొత్త కార్లు మార్కెట్లోకి రావడంతో యజమానులు పాత వాటిని తీసేసి కొత్తవి కొంటున్నారు. దీంతో మార్కెట్లో మంచి కండిషన్ ఉన్న కార్లు అమ్మకానికి పెట్టేస్తున్నారు.

- మార్కెట్‌లో యూజ్డ్ కార్లకు డిమాండ్
- కొత్త వాటితో పోలిస్తే పాతిక శాతం ధరల్లోనే లభ్యం
- మక్కువ చూపుతున్న మధ్య తరగతి వర్గాలు

జగిత్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ కారులో తిరగాలనే కోరిక ఉండటం సహజమే. సొంత ఇల్లు అనే కోరిక నెరవేరిన తర్వాత ప్రతి మనిషికి ఉండే స్వప్నం కారు. ఇల్లు, ఇంటి ముందు కారు ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. ఇప్పుడున్న ప్రస్తుత సమాజంలో కార్లను కొనేందుకు ఎంతో మంది ఆసక్తి చూపిస్తున్నారు. కొంతమంది మాత్రం మార్కెట్లోకి ఏ కొత్త రకం కారు వస్తే దానిని కొనేస్తుంటారు. అందుకు తగ్గట్టుగానే కస్టమర్స్‌ను ఆకర్షించేలా పలు రకాల కార్లు అందుబాటులోకి వస్తున్నాయి. మరి కొంతమందికి కారులో తిరగాలని కోరిక ఉన్నా, కారు కొనుగోలు చేసే స్తోమత లేక వెనకడుగు వేస్తుంటారు. మరికొంత మంది మాత్రం కొత్త కారుకు బదులు సెకండ్ హ్యాండ్ కార్లను కొనుగోలు చేస్తుంటారు. అందుకు అనుగుణంగా కస్టమర్లను ఆకట్టుకునేలా అన్ని రకాల సెకండ్ హ్యాండ్ కార్స్ కన్సల్టెన్సీలో అందుబాటులో ఉంటున్నాయి. జిల్లా కేంద్రమైన జగిత్యాలతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి తదితర పట్టణాల్లో సుమారు పాతిక వరకు సెకండ్ హ్యాండ్ కార్స్ సెల్స్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి.


జగిత్యాలలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న యూజ్‌డ్ కార్లు

● అప్ గ్రేడ్ వర్షన్‌లోకి మారుతుండడం వల్లే...

ఇక ఇప్పటికే కార్లున్నవారు అప్‌గ్రేడ్ వెర్షన్‌లోకి మారడం కూడా యూజ్డ్ కార్ల మార్కెట్‌లోకి పెద్ద ఎత్తున వాహనాలు వచ్చేలా చేస్తున్నది. ఇదిలా ఉంటే కుటుంబం మొత్తం తక్కువ ఖర్చుతో ప్రయాణించే వెసులుబాటు ఉం డటం, ప్రైవసీ, ఇతరత్రా సౌకర్యాల వల్ల కూడా ఇప్పుడు మధ్యతరగతి వర్గాలు యూజ్డ్ కార్లపైనే మక్కువ చూపిస్తున్నారు. మొత్తానికి లగ్జరీ కార్ల దగ్గర్నుంచి మిడిల్, స్మాల్ సెగ్మెంట్లలోని కార్లు ఈ ప్రీ-ఓన్డ్ వెహికల్స్ మార్కెట్‌లో లభిస్తున్నాయి.

● అందుబాటు ధరల్లో..

ప్రీ ఓన్డ్ వెహికల్ బిజినెస్ మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. నచ్చిన కార్లు సరసమైన ధరలకే లభిస్తుండడం, ఫైనాన్స్ సౌకర్యం కూడా ఉండటం, వారంటీలు ఇస్తుండడంతో పలువురు సెకండ్ హ్యాండ్ కార్లను కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు.కొత్త కార్ల ధరలతో పోల్చితే 15-25 శాతం ధరల్లోనే యూజ్డ్ కార్లు అందుబాటులో ఉంటుండటం ఇప్పుడు ఈ మార్కెట్‌ను పరుగు పెట్టిస్తున్నది. సెకండ్ హ్యాండ్ కారును కొనుగోలు చేయడం వల్ల కొత్త కారుతో పోలిస్తే డబ్బులు చాలా ఆదా అవుతాయి.మార్కెట్‌లోకి రకరకాల వేరియంట్లు, అబ్బురపరిచే ఫీచర్లతో వస్తుండడంతో చాలా మంది ఇప్పటికే ఉన్న పాత కార్లను అమ్మేస్తున్నారు. ఇందుకు సెకండ్ హ్యాండ్ కార్ సేల్ సెంటర్లు చక్కటి వేదికలుగా నిలుస్తున్నాయి. ఇక అటు అమ్మే వారికి, ఇటు కొనే వారికి లాభదాయకంగా లావాదేవీలు జరుగుతుండడం...ఈ బిజినెస్‌ను బడా మార్కెట్‌గానే మార్చేస్తోంది. ఏదైనా కంపెనీకి చెందిన ఓ మోడల్ కొత్త కారు ధర రూ. 10 లక్షలుగా ఉంటే...అదే మోడల్ పాత కారు ధర రూ. 2 లక్షలుగానే ఉండటం...కస్టమర్లను ఈ వైపు చూసేలా చేస్తున్నదని మార్కెట్ వర్గాలు ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నాయి. కండీషన్‌లో ఉండి, తక్కువ కిలో మీటర్లు తిరిగి, అప్‌గ్రేడ్ వెర్షనైతే మరో రూ. 50,000ల నుంచి రూ. లక్ష రూపాయలు ఎక్కువగా పెట్టుకోవాల్సి వస్తుందని చెప్తున్నారు. దీంతో అన్ని విధాలా సరిపోయే కారు రూ. 2.5 లక్షలు - రూ. 3 లక్షల్లో వచ్చేస్తున్నది.

నచ్చిన కార్లు...తక్కువ ధరల్లోనే..

- కట్కం ప్రసాద్, జగిత్యాల జిల్లా



నచ్చిన కార్లు సరసమైన ధరల్లోనే అందుబాటులో లభిస్తుండడంతో చాలా మంది సెకండ్ హ్యాండ్ కార్లు కొనుగోలు చేస్తున్నారు. మంచి కండిషన్‌లో ఉన్న కార్లను తక్కువ ధరలకు కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు. ప్రయాణానికి సైతం సౌకర్యవంతంగా ఉంటున్నాయి.

ఫైనాన్స్ సౌకర్యం సైతం ఉంటోంది

- దొనికెల నవీన్, యువకుడు, జగిత్యాల జిల్లా



సెకండ్ హ్యాండ్ కార్లు కొనుగోలు చేస్తున్న యజమానులకు ఫైనాన్స్ సౌకర్యం సైతం అందుతోంది. తక్కువ ధరలో మంచి మోడల్ కారు లభిస్తుండడంతో దీనికి తోడు తక్కువ వడ్డీతో ఫైనాన్స్ సౌకర్యం ఉంటుండడం వల్ల సెకండ్ సేల్స్ వైపు వినియోగదారులు ఆసక్తికనబరుస్తున్నారు.

మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటు ధరల్లో..

- ప్రభురాజ్ లక్ష్మీ నర్సయ్య, ప్రయివేటు డ్రైవర్, జగిత్యాల జిల్లా



మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటు ధరల్లో సెకండ్ హ్యాండ్ కార్లు లభిస్తున్నాయి. ఇందు వల్ల చాలా కుటుంబాలు సెకండ్ హ్యాండ్ కార్లు కొనుగోలు చేసి తమ కలను నిజం చేసుకుంటున్నారు. మార్కెట్‌లో వస్తున్న కొత్త వర్షన్ కార్లపై క్రేజీ పడుతున్న కొందరు తమ వద్ద ఉన్న పాత కారును ఎంతో కొంతకు అమ్ముతున్నారు. వీటిని కొనుగోలు చేసి మధ్య తరగతి కుటుంబాల సభ్యులు వినియోగిస్తున్నారు.

న్యూస్ బాక్స్

కస్తూర్బా విద్యార్థినులకు అస్వస్థత

ముత్తారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ ఆశ్రమ పాఠశాలలోని సుమారు 50 మంది విద్యార్థినులు ఆదివారం సాయంత్రం అస్వస్థతకు గురయ్యారు. ఆరు, ఏడు తరగతుల విద్యార్థినులకు ఒక్కసారిగా 50 మందికి పైగా దగ్గు రావడంతో పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులు గమనించి ప్రాథమిక చికిత్స అందించి పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం వాతావరణ మార్పుల వల్ల విద్యార్థులు దగ్గరదగ్గరగా ఉండడంతో దగ్గు అందరికీ వ్యాపించిందని వైద్యుడు అమరేందర్ తెలిపారు. విద్యార్థులు ఆ సమయానికి భోజనం చేయలేదు కనుక ఫుడ్ పాయిజన్ కాలేదని నిర్ధారించారు. తొమ్మిది గంటల వరకు విద్యార్థినులకు దగ్గు తగ్గడంతో ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు నిర్ధారణ చేశారు. కాగా, విద్యార్థినులకు ఒక్కసారిగా దగ్గు రావడంతో స్థానికంగా ఉన్న తల్లిదండ్రులు ఆందోళన చెందారు. పాఠశాల వద్దకు వెళ్లడంతో వారిని ఆవరణలోకి అనుమతించకపోవడంతో కొంత ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు విద్యార్థినులు దగ్గుతో ఇబ్బంది పడుతున్నారన్న ఆందోళనతో తల్లిదండ్రులు వివరాలు అడిగేందుకు ప్రయత్నించారు. అయితే పాఠశాల లోపల ఉన్నవారు గేట్లకు తాళాలు వేసి నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శించారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబులెన్స్ తో పాటు ప్రైవేటు వాహనాల్లో తల్లిదండ్రులు, స్థానికుల సహకారంతో పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి విద్యార్థినులను సమయానికి తరలించడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

'రాజన్న' గోశాల పరిశీలన

వేములవాడ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజన్న గోశాలను ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. కోడెలకు సకాలంలో మేత వేయాలని ఉద్యోగులకు సూచించారు. కట్ట కింద గోశాలను, కొత్తగా వచ్చిన ఆరు కోడెలను పరిశీలించారు. సోమవారం సందర్భంగా భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున నందీశ్వర, లక్ష్మీగణపతి ధర్మశాలలను పరిశీలించారు. ఆయన వెంట ప్రోటోకాల్ మరియు గదుల విచారణ పర్యవేక్షకులు జి అశోక్ కుమార్, గోశాల ఇన్‌చార్జి వి పరమేష్ ఉన్నారు.

జాతీయ యోగాలో తెలంగాణకు పసిడి పతకం

- రికార్డు సృష్టించిన దీపక్



బంగారు పతకంతో దీపక్

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి యోగా పోటీల్లో తెలంగాణకు తొలి సారిగా స్వర్ణ పతకం లభించింది. జిల్లాలోని మానకొండూర్ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న పి దీపక్ సబ్‌జూనియర్ విభాగంలో పసిడి పతకం సాధించి రికార్డు సృష్టించాడు. హిమాచల్‌ప్రదేశ్‌లోని ఉనాలో ఈనెల 24 నుంచి 27 వరకు జరిగిన జాతీయ పోటీల్లో దీపక్ గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా దీపక్‌ను, కోచ్ రామకృష్ణను తెలంగాణ యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, జిల్లా యోగా అసోసియేషన్ బాధ్యులు అభినందించారు.


జూడో పోటీల్లో సత్తా చాటాలి

- రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షుడు కడారి అనంతరెడ్డి


పోటీలను ప్రారంభిస్తున్న కడారి అనంతరెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు సత్తాచాటి చాంపియన్‌గా నిలవాలని రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షుడు కడారి అనంతరెడ్డి అన్నారు. జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కరీంనగర్ మంకమ్మతోటలోని సాయి మానేరు పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల జూడో ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులలో ఆత్మస్థైర్యానికి, ఆత్మ విశ్వాసానికి జూడో క్రీడ ఎంతగానో దోహద పడుతుందన్నారు. జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా స్థాయి జూడో ఎంపిక పోటీలకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 150 మందికిపైగా బాలబాలికలు హాజరైనట్లు పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో రాణించిన క్రీడాకారులను వరంగల్ జిల్లాలో జరిగే 68వ రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సరితరెడ్డి, పీడీలు, పీఈటీలు రమణ, విద్యాసాగర్, శ్రీధర్, శ్రీనివాస్, సుధాకర్, నరేందర్, కోచ్ సాయిరాం యాదవ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


రుచిత్‌రెడ్డి

ఇల్లంతకుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అంకిళ్ళ రుచిత్‌రెడ్డి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న రుచిత్‌రెడ్డి పాఠశాల స్థాయి క్రీడలలో అండర్ 17విభాగంలో ఇటీవల గోదావరిఖనిలో జరిగిన పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాడు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై హెచ్‌ఎం పావని, వ్యాయామ ఉపాధ్యాయుడు సాన బాబు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ బట్టు పద్మ తదితరులు అభినందించారు.

రాష్ట్రంలో యువజన కమిషన్ ఏర్పాటు చేయాలి

- యువతకు ఉపాధి కల్పనలో మోదీ సర్కారు విఫలం

- సీపీఐ జాతీయ నేత చాడ వెంకట్‌రెడ్డి

జ్యోతినగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యువజన కమిషన్‌ను ఏర్పాటు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌నకు చాడా వెంకట్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. స్వాతంత్రం వచ్చి 76ఏళ్లు దాటుతున్నప్పటికీ దేశంలో ఆర్థిక అసమానతలు అలాగే ఉన్నాయన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వల్ల దక్కిన ప్రాథమిక హక్కులను సైతం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం హరిస్తోందన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత మత రాజకీయాలకు ప్రాధాన్యతనిస్తున్నాడని విమర్శించారు. దేశంలో యువకు ఉపాధి మార్గాలు చూపించకుండా అభివృద్ధి సాధ్యం కాదన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ఇచ్చిన హామీని మోదీ మర్చిపోయాడన్నారు. 10 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. దేశంలోని సహజ వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్(ఏఐవైఎఫ్) జాతీయ క్యాదర్శి తిరుమలై రామన్ ప్రసంగిస్తూ సిద్ధాంతపరమైన రాజకీయ, శాస్త్రీయ ఆచరణకు వర్క్‌షాప్‌లు దోహదపడుతాయన్నారు. విద్య, ఉపాధి, వైద్యం కోసం నేటి యువత పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మానస్ కుమార్, మార్కురిరి సూర్య, నాయకులు రవి, శంకర్, యుగంధర్, శ్రీనివాసులు, రామకృష్ణ, మహేందర్, కొండల్, మహేశ్, చిలుక రాజు, శ్రీను, సదానందం, గౌతం, మోహన్, కనకరాజు, ప్రజానాట్యమండలి కళాకారులుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

వరద కాలువలో వైద్యుడి గల్లంతు


ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ, సీఐ, ఇన్‌సెట్‌లో పాకనాటి ఉదయ్‌కిరణ్‌రెడ్డి(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి రూరల్ మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రా మంలోని విట్టంపేట శివారులో ఉన్న ఎస్సారెస్పీ వరద కాలువలో ఈత కొడుతూ పాకనాటి ఉదయ్‌కిరణ్‌రెడ్డి(29) అనే వైద్యుడు ఆదివారం గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి, రాయికల్ మండల కేంద్రాల్లో వైద్యులుగా పనిచేస్తున్న పాకనాటి ఉదయ్‌కిరణ్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్ స్నేహితులు. ఆదివారం వారంతా సరదాగా గడపడానికి మరో ఇద్దరు వైద్యులు ఆత్మకూరి రాజు, లింగాల నిఖిల్‌తో కలిసి మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామానికి వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో విట్టంపేట శివారులో ఉన్న ఎస్సారెస్పీ వరద కాలువలో ఈత కొట్టేందుకు ఆగారు. కాలువలో స్నానం చేయడానికి వారంతా దిగారు. ఈత కొడుతుండగా ఉదయ్‌కిరణ్‌రెడ్డి నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు వెంటనే ఒడ్డుకు చేరుకుని అక్కడే ఉన్న జాలర్లకు విషయం తెలిపారు. జాలర్లు ఎంత ప్రయత్నించినా ఉదయ్‌కిరణ్‌రెడ్డి ఆచూకీ తెలియలేదు. పోలీసులు అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్సారెస్పీ అధికారులకు సమాచారం అందించి నీటి ప్రవాహం తగ్గించేందుకు వరుదకాలువ గేట్లు మూసివేయించారు. అప్పటికే చీకటి పడిపోవడంతో గాలింపు చర్యలకు ఆటంకంగా మారింది. ఉదయ్‌కుమార్‌రెడ్డి హనుమకొండ జిల్లా వేలేరు గ్రామానికి చెందిన వాడు. ఆయన గల్లంతైన విషయాన్ని కుటుంబ సభ్యులకు, పోలీసులు సమాచారం అందించారు.

దిగువ మానేరులో అరుదైన పక్షులు

- కరీంనగర్‌కు వలస వచ్చిన ఇండియన్ స్కిమ్మర్స్
- ఈ ప్రాంత జీవ వైవిధ్యానికి కొత్త అందం..




మానేరు డ్యాంలో ఇండియన్ స్కిమ్మర్స్ పక్షులు

పక్షులను కెమెరాలో బంధిస్తున్న బర్డ్ వాచర్స్

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ స్కిమ్మర్స్.. ఈ పక్షులు అరుదైనవి.. ఇవి మధ్యప్రదేశ్, రాజస్థాన్ సరిహద్దుల్లో ప్రవహించే చంబల్ నది, ఒడిస్సాలోని మహానది ఇసుక మేటల్లో నివసిస్తూ ఉంటాయి. శీతాకాలంలో ఆహారం కోసం సముద్ర తీర ప్రాంతాలకు వలస వెళుతుంటాయి. అటువంటి ఇండియన్ స్కిమ్మర్స్ కరీంనగర్ సమీపంలోని లోయర్ మానేరు డ్యాంలో కనిపించాయి. ఈ పక్షులు గత ఏడాది లోయర్ మానేరు డ్యాంకు వలస వచ్చినట్లుగా ఐయూసీఎన్ (ఇంటర్‌నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్) వారు గుర్తించారు. అరుదైన పక్షులు ఈ ప్రాంతానికి వలస రావడంతో పక్షి ప్రేమికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు వీటి రాకతో ఈ ప్రాంత జీవవైవిధ్యానికి కొత్త అందం చేకూరినట్లైంది. ఈ నెలలో ఇండియన్ స్కిమ్మర్స్ లోయర్ మానేరు డ్యామ్‌లో రెండోసారి కనబడినట్లు ఈ-బర్డ్‌లో రికార్డయ్యింది. ఈ అరుదైన పక్షుల గురించి తెలుసుకోవడానికి కరీంనగర్ బర్డింగ్ కమ్యూనిటీ(కేబీసీ) ప్రతినిధులు ప్రయత్నించారు. ఈ పక్షుల సంఖ్యను లెక్కించడంతోపాటు, వాటి రూస్టింగ్ (విశ్రాంతి)ప్రదేశాలను కనుగొన్నారు. ఈ సమాచారాన్ని కరీంనగర్ అటవీశాఖ అధికారులకు అందించడానికి కరీంనగర్ బర్డింగ్ కమ్యూనిటీ(కేబీసీ) ప్రతినిధులు ఒక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అంతరించిపోతున్న ఇండియన్ స్కిమ్మర్స్ పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని చర్చించారు.

● ఇండియన్ స్కిమ్మర్స్ ప్రత్యేకతలు....

ఇండియన్ స్కిమ్మర్స్ నలుపు రంగులోను, తెలుపు రంగులో ఉంటాయి. ముక్కు ముదురు నారింజ రంగులో, ముక్కు చివరి భాగం పసుపు రంగులో ఉంటుంది. ముక్కుపై భాగం చిన్నగా, కింద భాగం పెద్దగా ఉంటుంది. ఇవి రివర్ టెర్న్ పక్షులను తలపించేలా ఉన్నప్పటికీ, ఆహారాన్ని సేకరించే విధానాన్ని బట్టి వీటిని ప్రత్యేకమైన పక్షులుగా గుర్తించవచ్చు. ఇవి నది ఉపరితలంపై ఎగురుతూ ముక్కుతో నీటిలోని చేపలను అందుకొని గాలిలోనే ఎగురుతూ చేపలను తింటాయి. ఈ కారణంగా వీటిని స్కిమ్మర్స్ అని పిలుస్తారు. ఇవి దక్షిణాసియా భూభాగానికి మాత్రమే పరిమితం. వీటి సంఖ్య అంత్యత వేగంగా తగ్గుతున్నది. గత మూడేళ్లలో 30 శాతానికి పైగా పడిపోయింది. ప్రస్తుతం ఇండియాలో ఈ పక్షులు సుమారు 2,700 ఉండొచ్చని ఒక అంచనా. ఇవి సాధారణంగా జనాల అలికిడి లేని నది, సముద్రం మధ్యలోని ఇసుక మేటల్లో, ద్వీపాల్లో నివాసం ఏర్పాటు చేసుకుంటాయి. దిగువ మానేరు జలాశయం మధ్యలో పెద్ద బండరాళ్లు, చిన్న చిన్న ద్వీపాలు ఉండటంతో ఇండియన్ స్కిమ్మర్స్ వాటిలో ఆవాసం ఏర్పాటు చేసుకుని మానేరు జలాశయం నీటిలో చేపలు, కీటకాలను ఆహారంగా తీసుకుంటూ జీవిస్తున్నాయి. అరుదైన ఇండియన్ స్కిమ్మర్ పక్షుల సమాచారాన్ని కరీంనగర్ బర్డింగ్ కమ్యూనిటీ(కేబీసీ) వ్యవస్థాపకులు మూటపల్లి గంగాధర్, మధు గోసిక, అబ్దుల్ రహీం, వివేక్ మాత కరీంనగర్ అటవీశాఖ అధికారులకు అందించారు.

నేడు నగరంలో
విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో 132/33కెవి పద్మనగర్ సబ్‌స్టేషన్ నుంచి 33కెవి సప్తగిరి ఫీడర్ మరమ్మతులో భాగంగా సోమవారం ఉదయం 9 గంటల నుండి 10 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ లావణ్య తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపి వేయు ప్రాంతాలు, కాశ్మీర్ గడ్డ, తెలంగాణ చౌక్, ముఖరంపుర, గోదంగడ్డ, భగత్‌నగర్, మంకమ్మతోట, పొన్నం కాంప్లెక్స్ సప్తగిరికాలనీ, శ్రీనగర్ కాలనీ, రామచంద్రపురి కాలనీ, శివనగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని కోరారు.

పండ్లు పంపిణీ

గణేశ్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నవ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎన్‌టీఎస్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర సంజయ్ కుమార్ జన్మదినం సందర్భంగా ఆదివారం కరీంనగర్ లోని హౌసింగ్ బోర్డు కాలనీ కపిల్ బాల కుటీరంలో జిల్లా అధ్యక్షుడు సాయి పటేల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్, నాయకులు మునుగంటి వినయ్, ప్రేమ్ చందర్, చకిలం సాయి, సాహిత్, విష్ణు, పార్థు, రాహుల్, మహితేజ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

కరీంనగర్ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 59వ డివిజన్ సుస్మాస్వరాజ్ చౌరస్తాలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్‌కీ బాత్, బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యుడు రెడ్డెడ్డి శ్రీనివాస్ (బాలు) ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమల అంజనేయులు, మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు హాజరై పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు.

ఈకార్యక్రమంలో వెస్ట్‌జోన్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, నాయకులు రాగి సత్యనారాయణ, ఎడమ సత్యనారాయణరెడ్డి, వైద రామానుజం, పబ్బల్ల ఆంజనేయులు, దయ్యాల అశోక్, కర్రె రాజమల్లు, దయ్యాల మల్లేశం, ఒల్లం సంజీవ్ పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- మాజీ మంత్రి నేరేళ్ల ఆంజనేయులు



జమ్మికుంటలో సభ్యత్వ నమోదు చేపడుతున్న బీజేపీ నాయకులు

జమ్మికుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హామీలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు అన్నారు. పట్టణంలో ఆదివారం బీజేపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన మాజీ మంత్రి మాట్లాడుతూ పలు రకాల హామీలతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందన్నారు. తెలంగాణలో బీజే పీ రానున్న రోజుల్లో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎరబెల్లి సంపత్‌రావు, నాయకులు నరసింహరాజు, పుప్పాల రఘు, జీడి మల్లేష్, పల్లవు రవి, ఠాగూర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: బీజేపీ సభ్యత్వ నమోదును వేగంగా పూర్తి చేయాలని మాజీ మంత్రి నేరేళ్ల ఆంజనేయులు అన్నారు. చల్లూరులో పార్టీ సభ్యత్వ నమోదును ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, నాయకులు నర్సింహరాజు, పుప్పాల రఘు, మల్లారెడ్డి, రవి, సదానందం, అజయ్, శివ, రాజయ్య, రవి, శంకర్, నవీన్, హరీష్, గోపి, మణి, అరుణ్ పాల్గొన్నారు.

ఇల్లందకుంట: రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతోందని మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర నాయకుడు నేరేళ్ల ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డితో కలిసి ఆయన సభ్యత్వ నమోదును పరిశీలించారు. కార్యక్రమంలో ఎర్రబెల్లి సంపత్‌రావు, నర్సింహారాజు, పుప్పాల రఘు, గురుకుంట్ల సాంబయ్య, ఎండీ షఫీఖాన్, కొత్త శ్రీనివాస్, రమేశ్, దుర్గయ్య, వినయ్, అజయ్, సం జీవ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, మెడికోలు

సుభాష్‌నగర్,అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): ప్రతిమ మెడికల్ కాలేజీ, ప్రతిమ ఫౌండేషన్ సహకారంతో డిపార్ట్‌మెంట్ ఆఫ్ జనరల్ సర్జరీ ఆధ్వర్యంలో పింక్ అక్టోబరు నెలను పురస్కరించుకొని రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఆదివారం నగరంలోని ఐఎంఏ హాలు నుంచి గీతాభవన్ చౌరస్తా, కలెక్టరేట్ మీదుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియం వరకు డాక్టర్లు, మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రవీందర్‌రావు, సీఏవో రామచంద్రరావు, ప్రొఫెసర్ డాక్టర్ గీతారెడ్డి, ఓఎస్‌డీ డాక్టర్ టీకేకే నాయుడు, వైద్య సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు, ఫౌండేషన్ బాధ్యులు పాల్గొన్నారు.

●సుభాష్‌నగర్: లయన్స్‌క్లబ్ కాళేశ్వరి ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన, స్క్రీనింగ్ క్యాంపును నిర్వహించారు. ఆదివారం నగరంలోని కొండ సత్యలక్ష్మి గార్డెన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ అర్చనరెడ్డి, డాక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి క్యాన్సర్ లక్షణాలు, వివిధ దశలు, చికిత్స గురించి వివరించారు. అలాగే క్యాన్సర్ రాకుండా ఉండేందుకు ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు గురించి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు కంది జ్యోతి, కార్యదర్శి భారతి, కొండ రాధిక, గాయత్రి, మునిపల్లి పనీత, పద్మజ, రాణి తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

కరీంనగర్ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం ఇరుకుల్ల గ్రామానికి చెందిన మానేరు లయన్స్ క్లబ్ కార్యదర్శి మాజి ఉప సర్పంచ్ ముత్యం శంకర్ గౌడ్ తండ్రి ముత్యం వీరయ్య గౌడ్ వర్ధంతి సందర్భంగా పలు చోట్ల అన్నప్రసాద వితరణ చేశారు. ఆదివారం నగరరంలోని శక్తి సదన్ ఆశ్రమంలో, అలాగే నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో 2వందల మందికి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో లయన్ రావి కంటి కృష్ణ, కిషోర్, పాత శేఖర్, కిషన్, బైర్ల విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు ఉద్యోగానికి రాజీనామా

-ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేయాలనే సంకల్పంతో సోమవారం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ ప్రకటించారు. ఆదివారం నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2007నుంచి ఇప్పటి వరకు ఎన్నికైన పట్టభద్రుల ఎమ్మెల్సీలంతా ఉద్యోగుల, పట్టభద్రుల, నిరుద్యోగ యువత సమస్యలను పరిష్కరించకుండా అలంకారప్రాయంగా విధులు నిర్వహించారన్నారు. దీనితో ఇప్పటికీ అనేక సమస్యలు వారిని వెంటా డుతూనే ఉన్నాయని అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థిగా జూనియర్ లెక్చరర్ ఉద్యోగం పొంది, 15 ఏళ్ళ నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న తనకు ఉద్యోగ, పట్టభద్రుల, నిరుద్యోగ యువత సమస్యలపై అవగాహన ఉందన్నారు. వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానన్నారు.

అంతా 'కల్తీ' మయం

(3వ పేజీ తరువాయి)

కోతిరాంపూర్‌లోని గిద్దెపెరుమాళ్ల ఆలయ పరిసర ప్రాంతాల్లో ఒక ఆహార పదార్థాల తయారీ కేంద్రంపై పోలీసులు తనిఖీలు నిర్వహించగా తినుబండారాలను తయారు చేస్తున్న నిర్వాహకుడు నాణ్యత, పరిశుభ్రతను పాటించడం లేదని గుర్తించారు. పద్మనగర్‌లో ఒక షాపులో కల్తీ నట్టల మందును తయారు చేస్తున్న కేంద్రంపై పోలీసులు దాడి చేశారు. అక్రమ దందాలకు పాల్పడిన వారిపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాలను ప్రయోగిస్తేనే నియంత్రణలోకి వస్తాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

కొత్తపల్లి పట్టణ కురమ సంఘం అధ్యక్షుడిగా రాజు

భగత్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి పట్టణ కురమ సంఘం అధ్యక్షుడిగా బైరి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా మ్యాకల వెంకటేశం, పుల్లరాజు, పెద్ది మురళి, ఎల్లమ్మల రమేష్, ఒగ్గరి శ్రీకాంత్, తొంటివీరేశం, కూకట్ల కుమార్, ఒగ్గరి పోచమల్లు ఎన్నికయ్యారు.

సాహితీ సేవా రత్న పురస్కారానికి వైరాగ్యం ప్రభాకర్ ఎంపిక

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 27: మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ వాల్మీకి జయంతి సందర్భంగా ఈనెల 30న హైదరాబాద్ త్యాగరాయ గానసభలో నిర్వహించే వేడుకల్లో నగరానికి చెందిన కవి, రచయిత, భవానీ సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్‌కు సాహితీ సేవారత్న పురస్కారం అందజేయనున్నట్లు సంస్థ గౌరవాధ్యక్షుడు డాక్టర్ వి రాజగోపాల్, అధ్యక్షుడు డాక్టర్ వివిఎస్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే సభలో జరిగే కవి సమ్మేళనానికి ప్రభాకర్ విశిష్ట అతిథిగా కూడా ఆహ్వానం అందుకున్నారు. బీజేపి సీనియర్ నాయుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరు కానుండగా అతిథులుగా ఏపి సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ డాక్టర్ కొకలూరి ఇనాక్, అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఆదోని ఎంఎల్‌ఏ డాక్టర్ పి పార్థసారధి, దూరదర్శన్ మాజీ డిడి డాక్టర్ ఓలేటి పార్వతీశం, త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా విఎస్ జనార్దనమూర్తి, నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ బిక్కి కృష్ణ పాల్గొననున్నారు.

కురుమ సంఘం ఆధ్వర్యంలో సన్మానం

భగత్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కొత్తపల్లికి చెందిన చిగుర్ల శ్రీనివాస్ కురుమసంఘం అధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన చిగుర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీలకు చట్టసభల్లో యాభై శాతం రిజర్వేషన్, విద్యార్థుల ఫీజు రీఎంబర్స్‌మెంట్ కోసం పోరాటం, ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి కురమ సంఘం అధ్యక్షుడు, పాలక వర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్ పోటీలకు వివేకానంద విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న వివేకానంద ప్రిన్సిపాల్ శ్రీనివాస్

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 26: ఆంధ్రప్రదేశ్‌లోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 17 నుంచి 19 వరకు నిర్వహించిన 35వ సౌతిండియా జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో నగరంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థి ఎం వినజ్ ప్రతిభ కనబరిచి 3 వేల మీటర్ల పరుగుపందెం పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థి వినయ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, ఏవో బండి శ్రవణ్ కుమార్, ఏసీవో బండి సంపత్ కుమార్, బి రామేశ్వర్‌రావు, పీడీ పన్యాల శ్రీనాథ్ రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుదాం

చొప్పదండి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుదామని సీపీఎం జిల్లా కార్యదర్శి గీట్ల ముకుంద రెడ్డి అన్నారు. చొప్పదండిలో ఆదివారం నిర్వహించిన మండల ప్రజా సంఘాల సమన్వయ కమిటీ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర విధానాలపై ప్రజలు, ప్రజాసంఘాలు పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్ మండల ప్రజాసంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ గంగిపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

-పీటీసీ ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్



శ్రీనివాస నామ గీతం సీడీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కరీంనగర్‌టౌన్/కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీనివాసుడి నామధేయంతో ఉన్న శ్రీనివాసులంతా ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పోలీసు ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్, ఏఎస్పీ ఎస్.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో తెలంగాణ శ్రీనివాసుల సేవా సమితి జిల్లా కన్వీనర్ ఊట్కూరి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీనివాస మిత్రుల మొదటి వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శ్రీనివాసులను ఏకం చేసి ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఊట్కూరి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీనివాసుల సేవా సమితిని 26మంది సభ్యులతో ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను చేపడతామని, సహకరించిన ప్రతి శ్రీనివాస్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా 60 మంది శ్రీనివాసులు రక్తదానం చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి పురమల్ల శ్రీనివాస్, చిందం శ్రీనివాస్, డాక్టర్ శ్రీనివాస్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ గట్టు శ్రీనివాస్‌తో పాటు 600 మందికిపైగా వివిధ జిల్లాల్లోని శ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం రక్తదానం చేసిన, కార్యక్రమానికి సహకరించిన శ్రీనివాసులను నిర్వాహకులు శాలువతో సన్మానించారు. రచయిత, గాయకుడు, వ్యాఖ్యాత అయిన నంది శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూపొందించిన శ్రీనివాస నామ గీతం సీడీని వేదికపై ఆవిష్కరించారు.

ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): 2021 నవంబర్ 6వరకు డిగ్రీ, ఆపై చదివిన పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్, టీచర్స్ లెక్చరర్స్‌జేఏసీ కన్వీనర్ రాజేశ్వర్ పిలుపునిచ్చారు. ఓటరు నమోదు పత్రాలను డివిజన్ ప్రతినిధుల వద్ద ఉన్నాయని, వాటిని పూర్తి చేసి డిగ్రీ మెమో, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టుసైజు ఫొటో, ఎలక్షన్ ఐడీ కార్డు జిరాక్సులను జత చేసి ఇవ్వాలని సూచించారు.

ఎమ్మెల్యే గంగులకు పరామర్శ

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్‌ను మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ దంపతులు పరామర్శించారు. ఆదివారం నగరంలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఎమ్మెల్యే మాతృమూర్తి గంగుల లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే గంగుల కమలాకర్, గంగుల సుధాకర్, వారి కుటుంబసభ్యులను పరామర్శించి, ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

'వొడితెల ప్రణవ్‌పై విమర్శలు సరికావు'

హుజూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్‌పై బీఆర్ఎస్ నాయకుల విమర్శలు సరికావని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సొల్లు బాబు, కొల్లూరి కిరణ్, నేరేళ్ల మహేందర్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో నాయకులు కొలిపాక శంకర్, సంద మల్ల బాబు, మిడిదొడ్డి రాజు, రవి, కిరణ్‌రెడ్డి, చాంద్‌పాషా, రేణుక, శారద, రియాజ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరు హర్షణీయం

జమ్మికుంట రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం విలాసాగర్ - రూపునారాయణపేట గ్రామాల మధ్య ఉన్న మానేరు నదిపై వంతెన నిర్మాణం కోసం రూ.80కోట్ల నిధుల మంజూరు హర్షణీయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే విజయ రమణారావు, హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడి తెల ప్రణవ్‌బాబు చిత్రపటాలకు విలాసాగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యకమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రెడ్డి జేఏసీ మండల కమిటీ

చిగురుమామిడి, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం రెడ్డి జేఏసీ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కల్వల రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కరివెద మహేందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా మంకు శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ యూత్ అధ్యక్షుడిగా తాటి కొండ సంజీవరెడ్డి ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా చీల లక్ష్మారెడ్డి, గాదె రఘునాథరెడ్డి, సింగిరెడ్డి స్వామిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా ఉత్తర తెలంగాణ అధ్యక్షుడు పెండ్యాల రామిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు జున్నుతుల రాజి రెడ్డి, ఉమ్మడి జిల్లా ప్రధానకార్యదర్శి ఏనుగు చుక్కారెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసి డెంట్ దారం జగన్నాథరెడ్డి తదితరులు హాజరయ్యారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న 2012-13 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

రామడుగు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని 2012-13లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనాడు పాఠాలు చెప్పిన గురువులను సన్మానించారు.

●కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ 2000-2001 సంవత్సర పదవతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆనాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులైన వసీయోద్దీన్, చొక్కారెడ్డి, అనంతరావు, వెంకటేశ్వర్‌రావు, ప్రభాకర్‌రావు, వీరయ్యలను శాలువాలతో కప్పి సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు ఆట పాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు.

మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా ముప్పిడి సునీల్



కరీంనగర్ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మంకమ్మతోట మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా ముప్పిల్ సునీల్‌కుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం మంకమ్మతోట మున్నూరుకాపు సంఘం ఎన్నికలు జరిగాయి. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్ హాజరై మాట్లాడుతూ మున్నూరుకాపు సంఘం సభ్యులు ఐక్యంగా ఉండాలని, సంఘ పటిష్టతకు, సభ్యుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శిగా కొట్టె శేఖర్, కోశాధి కారిగా ఎన్నం దేవేందర్‌లను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ దిండిగాల మహేశ్, పలువురు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికులను ఆదుకోవాలి

గంగాధర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పవర్ లూమ్స్ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. గర్షకుర్తి పవర్‌లూమ్స్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పవర్ లూమ్స్ కార్మికులకు గుడ్డ ఆర్డర్లు లేక అవస్థలు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

వీణవంక, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఉద్యమకారుల ఫోరం మండలాధ్యక్షుడు పెరుమాండ్ల సంపత్ అన్నారు. వీణవంకలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన 250 గజాల స్థలం, పెన్షన్‌లను వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కండె మహేందర్, సంఫీ గట్టయ్య, చింతల రాజిరెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తుక్కుగూడలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉద్యమకారులను కమిటీ వేసి గుర్తించాలని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

'అలకలపోత' పుస్తకావిష్కరణ



ఫిలింభవన్‌లో అలకలపోత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 27: నగరంలోని ఫిలింభవన్‌లో ఆదివారం తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో రచయిత తప్పెట ఓదయ్య రచన 'అలకల పోత' పుస్తకావిష్కరణ జరిగింది. ఈకార్యక్రమానికి విమర్శకుడు, సామాజికవేత్త, రచయిత పొనుగోటి కృపాకర్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్తమానంలో వెలువడు తున్న సజీవ చైతన్య సాహిత్యమంతా అస్తిత్వాల ఊరేగింపు అని అన్నారు. ఓదయ్య అద్భుత శీర్షికలతో కవిత్వ పుస్తకాలు తెస్తూ దళిత జీవన సౌందర్యాన్ని అక్షర బద్ధం చేస్తున్నారని అని అభినందించారు. తైదల అంజయ్య, సిద్దంకి యాదగిరి, బూర్ల వేంకటేశ్వర్లు, దామరకుంట శంకరయ్య, నడిమెట్ల రామయ్య, నెరువట్ల చైతన్య, కనకం శ్రీనివాస్, గుడికందుల అరుణ్ మాట్లాడారు. తెరవే జిల్లా అధ్యక్షుడు సీవి కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ నలిమెల భాస్కర్, అన్నవరం దేవేందర్, వీరగోని పెంటయ్య, రవిశంకర్‌రెడ్డి, కందుకూరి అంజయ్య, విలాసాగరం రవీందర్, కూకట్ల తిరుపతి, బసవేశ్వర్, సరసిజ, నిర్మలారాణి, లక్ష్మణ్, ప్రవీణ్, వేణు, కిషోర్, ప్రభాకర్, రంగన్న, ఖాలీద్, నసీరుద్దీన్, అఖిల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు

హుజూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గురు పౌర్ణమి సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలానికి హుజూరాబాద్ నుంచి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసినట్లు హుజూరాబాద్ డిపో మేనేజర్ రవీందర్‌నాథ్ తెలిపారు. స్థానికంగా ఆదివారం ఆయన మాట్లాడారు. నవంబరు 13న హుజూరాబాద్ నుంచి మధ్యాహ్నం 2గం టలకు బయలుదేరి ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం వరసిద్ధి వినాయకుడి దర్శనం అనంతరం వెల్లూర్‌లోని గోల్డెన్ టెంపుల్, 14న రాత్రి వరకు అరుణాచలం చేరుకుంటుం దన్నారు. 15న సాయంత్రం అరు ణాచలం నుంచి అలం పూర్ జోగులాంబను దర్శించుకొని 16న హుజూరాబాద్‌కు చేరుకుం టుందని చెప్పారు.

ఈ యాత్రలో అన్ని చార్జీలు కలుపుకొని పెద్దలకు 4,500, పిల్లలకు 3,800 రూపాయలుగా నిర్ణయించామన్నారు. భక్తులు వసతి, భోజనం, దర్శనం ఖర్చులు సొంతంగా భరించుకోవాలని చెప్పారు. అవసరమైన వారు డిపోలో సంప్రదించాలని కోరారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్



హుజూరాబాద్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదవారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులు, ఎల్‌వోసీ (లైన్ ఆఫ్ క్రెడిట్) పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే పేదలు, రైతులకు ప్రయోజనం చేకూరేలా పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. దీపావళి తర్వాత అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తారన్నారు. అనారోగ్యంతో బాధప డుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే రైతులకు ప్రభుత్వం రూ. 2లక్షల రుణమాఫీ చేసిందన్నారు. సన్నరకం ధాన్యానికి కూడా క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

● హుజూరాబాద్‌రూరల్: పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలని బీజేపీ నాయకులు కోరారు. మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సందర్శించారు.

● గంగాధర: ఉప్పరమల్యాలలో చిప్ప కళావతి, చిప్ప సత్యనారాయణ అక్క భూదేవి జ్ఞాపకార్థం గ్రామానికి ఫ్రీజర్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. వీరిని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించారు.

● మానకొండూర్: మాలల మహా పాదయాత్ర పోస్టర్‌ను మానకొండూర్‌లో మాల మహానాడు ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. మాల సంఘం అధ్యక్షుడు బొల్లం వెంకట్‌స్వామి మాట్లాడుతూ ఈ నెల 25న భద్రాచలం నుంచి ప్రారంభమైన వెయ్యి కిలోమీటర్ల మహా పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

- హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో ఈ నెల 24 నుంచి 27 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ యోగా పోటీల్లో ప్రతిభ చాటి దీపక్ స్వర్ణ పతకం సాధించడంతో ప్రిన్సిపాల్ జగన్నాథంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

- మానకొండూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985-86లో పదో చదివిన కుక్క రాజయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబానికి బాల్య మిత్రులు రూ. 14,601 ఆర్థిక సాయం అందజేశారు. అదే పాఠశాలలో 2000-01లో పదో తరగతి చదివిన సుదర్శన్ అనారోగ్యంతో మృతి చెందగా అతడి కుటుంబ సభ్యులకు బాల్య మిత్రులు రూ. 22వేలు అందజేశారు.

● హుజూరాబాద్: జగిత్యాలలో నిర్వహించే ఉమ్మడి జిల్లా సదస్సుకు హుజూరాబాద్ నుంచి ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ నాయకులు తరలి వెళ్లారు. అంబేద్కర్ విగ్రహా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- దీపావళి టపాసుల దుకాణదారుల యూనియన్ అధ్యక్షుడిగా బుర్ర కుమార్, ఉపాధ్యక్షుడిగా మంచికట్ల గౌతమ్‌కుమార్, కోశాధికారిగా భరత్‌కుమార్ ఎన్నికయ్యారు.

● ఇల్లందకుంట: పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ప్రజాసంఘాల సమన్వయ కమిటీ సమావేశం రాములు అధ్యక్షతన నిర్వహించారు.

● రామడుడు: గోపాల్‌రావుపేటకు చెందిన జాతీయ యువజన అవార్డు గ్రహీత అల్వాల విష్ణు సతీమణి రమ్యకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యేలు రవిశంకర్, దేవయ్య పరామర్శించారు.